ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

గురువారం 22 మే 2025



త్రిలింగ క్షేత్రం పుష్కర శోభితం..

- కాళేశ్వరంలో ఉత్సాహంగా సాగుతున్న సరస్వతీ పుష్కరాలు
- భక్తజన సంద్రమవుతున్న త్రివేణి సంగమం
- ఏడోరోజు లక్ష మందికి పైగా పుణ్యస్నానాలు
- రద్దీతో కిటకిటలాడిన బస్సులు
- అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్

పుష్కర స్నానం చేస్తున్న భక్తులు

పుష్కరాల్లో పారిశుధ్య నిర్వహణ సేవలు ఇలా..

విధుల్లో 700 మంది అధికారులు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు



ప్రధాన పుష్కర ఘాట్‌లో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీవో

కాళేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి):త్రివేణి సంగమ కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ పుష్కరాల్లో పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పారిశుధ్య నిర్వహణ లోపం లేకుండా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టడంతో అధికార యంత్రాంగం పుష్కర భక్తులకు ఇబ్బందులు కల్గవద్దని పలు చర్యలు చేపడుతుంది. నిత్యం వేలాది మంది భక్తులు హాజరవుతుండడంతో పుష్కరాల్లో ప్రధానసమస్య అయిన పారిశుధ్య నిర్వహణ ను పకడ్బందీగా చేపడుతున్నారు. సరస్వతీ పుష్కరఘాట్, గోదావరి ఘాట్, తాత్కాలిక బస్టాండ్, రహదారుల వెంట పారిశుధ్యకార్మికులు నిత్యం చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్‌ను ఎత్తి సంచుల్లో నింపి డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు.

పుష్కరాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా, ఎలాంటి విమర్శలు రాకుండా చేయడానికి అధికార యంత్రాంగం భూపాలపల్లి డీపీవో వీరభద్రయ్య, మంచిర్యాల, పెద్దపల్లి డీపీవోల నేతృత్వంలో ఇద్దరు డీఎల్‌పీవోలు, 50 మంది ఎంపీడీవోలు, ఎంపీవోలు, 156మంది పంచాయతీ కార్యదర్శులు, 496మంది ప్రైవేట్ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు 60మంది మల్టీపర్పస్ వర్కర్లను రిజర్వ్‌లో ఉంచారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పారిశుధ్య కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రప్పించారు. నిత్యం పారిశుధ్య కార్మికులు ఒక్కో షిఫ్టులో 200మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు నిత్యం కార్మికుల వెంట ఉండి పారిశుధ్య నిర్వహణ చేయిస్తున్నారు. పుష్కరాల చివరి రోజుల్లో భక్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అధికారులు మరో 150మంది పారిశుధ్య కార్మికులను రప్పిస్తున్నట్లు డీపీవో తెలిపారు.

పుష్కరాల్లో పక్కాగా భక్తజనం లెక్క..!

నిరంతరం వాహనాల సంఖ్యను నమోదు చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి):త్రివేణి సంగమక్షేత్రంలో సరస్వతీ పుష్కరాల సందర్భంగా ప్రతీ రోజు హాజరయ్యే భక్తుల సంఖ్యను లెక్కించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి నిత్యం భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. కాళేశ్వరం చేరుకోవడానికి మహదేవపూర్ వైపు నుంచి, అంతర్రాష్ట్ర వంతెన వైపు నుంచి భక్తులు వివిధ రకాల వాహనాల్లో వస్తుంటారు. దీంతో ఉన్నతాధికారులు ఈ రెండు వైపుల నుంచి వాహనాల సంఖ్యను లెక్కించేలా పోలీస్‌సిబ్బందిని నియమించారు. దీంతో వారు వాహనాలను లెక్కిస్తూ ప్రతీ రెండు గంటలకోసారి షిఫ్టులు మారుతూ తెల్లవారుజామునుంచి రాత్రి వరకు వాహనాలను లెక్కిస్తున్నారు. బుధవారం రాత్రి వరకు 5,148కార్లు, 525బస్సు ట్రిప్పులు, బైక్‌లు, టాటా మ్యాజిక్, బొలేరోలు, డీసీఎం తదితర వాహనాలు 3845లకు పైగా వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

వరదల నుంచి ప్రజలను రక్షించాలి

ములుగు కలెక్టర్ దివాకర



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వరదల వల్ల నష్టం కలుగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో బుధవారం రాబోయే వర్షాకాలంలో కురిసే వర్షాలు, వరదలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఎస్పీ రవీందర్‌లతో కలిసి వివిధశాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ గత సంవత్సరం సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడం, వరదల వల్ల నష్టం వాటిల్లిందని అన్నారు. జిల్లాలో ఎక్కువ వాగులు, గోదావరినది ఉందని, ఎగువ కురిసిన వర్షాలకు ఉధృతంగా వరదలు సంభవిస్తాయని, జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో గత మూడేళ్లుగా వర్షపాతం నమోదైన ప్రాంతాలను గుర్తించి నివేదికలు తప్పులులేకుండా తయారు చేయాలన్నారు. వరదలు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టేవిధంగా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, రేషన్ డీలర్లు, యువతను సమన్వయపరుస్తూ ప్రణాళిక బద్ధంగా గ్రామాల్లో వరద ఉధృతికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించాలన్నారు. చెరువులు, కుంటల మత్తళ్ల వద్ద అడ్డంకులు లేకుండా చూడాలని, వరదలు వస్తే నీరు వెళ్లడానికి అడ్డుపడి చెరువులు తెగిపోయే అవకాశం ఉంటుందన్నారు. దోమలు వ్యాప్తిచెందకుండా గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని, నీరు కలుషితం కాకుండా చూడాలని, మంచినీటి పైపులను పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. అదేవిధంగా వానాకాలంలో పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్, నేషనల్‌హైవే, ఆర్‌అండ్‌బీ, పంచాయ తీరాజ్, విద్యుత్‌శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

గాలి దుమారాలతో అప్రమత్తంగా ఉండాలి




అన్ని శాఖల అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్

కాళేశ్వరం, మే21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో అన్నిశాఖల అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అదేశించారు. రెండు రోజులు ఈదురు గాలులతో కుడిన వర్షాలు కురిసే అవకాశమున్నందున సింగరేణి రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బుధవారం ఆయన కాళేశ్వర్యంలో పరిస్థితులను సమీక్షించిన ఆయన ఈదురు గాలలు వర్షం వల్ల ఇబ్బంది జరిగితే అతి తక్కువ సమయంలో స్పందించి సహాయ చర్యలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

కురిసిన భారీ వర్షం.. తడిసిన వరి ధాన్యం

వివరాలు 8వ పేజీలో

మిర్చి జీరో దందా!



- కొనుగోళ్లన్నీ తెల్లకాగితాలపైనే.. రికార్డులోకి ఎక్కవ్.. పన్నులు చెల్లించరు..
- కొనుగోలు చేసిన ధర కాకుండా.. తక్‌పట్టీల్లో తక్కువ నమోదు
- రికార్డుల్లో నమోదు చేయకుండా జీఎస్టీ, సెస్‌కు ఎసరు
- మార్కెటింగ్ అధికారులు, వ్యాపారులు కుమ్మక్కు.. పని చేయని సీసీ కెమెరాలు..
- రైతుల నుంచి కమీషన్ల పేరుతో అడ్తి వ్యాపారుల వసూళ్ల దందా
- వరంగల్ రీజియన్‌లో ఏటా రూ.కోట్లలో పన్నులు ఎగవేత

జీరో కాంటాలతో ప్రభుత్వ ఆదాయానికి దళారుల గండి

వరంగల్, మే 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా పేరున్న వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లలో జీరో దందా జోరుగా సాగుతోంది. తక్‌పట్టీలో మిర్చి కొనుగోళ్లను నమోదు చేయకుండా.. తెల్లకాగితాలపై బిల్లులు నమోదు చేసి ప్రభుత్వానికి జీఎస్టీ, సెస్ ఫీజు చెల్లించకుండా ఎగవేతకు పాల్పడుతున్నారు. మరికొందరైతే రైతు నుంచి కొనుగోలు చేసిన ధరలు కాకుండా తక్కువ ధరలను తక్‌పట్టీల్లో నమోదు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అడ్తీదారులు, ఖరీదుదారులు కుమ్మక్కై కమీషన్ల రూపంలో అందినంతా దండుకుంటున్నారు. మార్కెట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు క్రయవిక్రయాలను పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్ అధికారుల్లో కొందరు వ్యాపారులు, దళారులతో కుమ్మక్కై అక్రమాలకు సహకరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోగా, ప్రభుత్వానికి ఏటా పన్నుల రూపంలో రావాల్సిన రూ.కోట్ల ఆదాయానికి గండి పడుతోంది.

తెల్లకాగితాలపై కొనుగోళ్లు..

రైతులు మిర్చిని విక్రయించేందుకు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నల్లగొండ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు సరుకులు తీసుకొస్తారు. సీజన్‌ను బట్టి రోజుకు 20వేల నుంచి 1లక్షకు పైగా మిర్చి బస్తాలను రైతులు తీసుకొస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న రైతుల అవసరాలు వ్యాపారులకు, దళారులకు వరంగా మారుతున్నాయి. మార్కెట్‌కు వచ్చిన మిర్చిని ఖరీదుదారుడు, అడ్తీదారుడి సమక్షంలో మార్కెటింగ్‌శాఖ సిబ్బంది (దడవాయిలు) ఎలక్ట్రికల్ కాంటాలో తూకం వేసి, రైతు నుంచి కొనుగోలు చేసిన మొత్తం మిర్చికి సంబంధించిన వివరాలతో కంప్యూటర్ బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే తూకం వద్దే వ్యాపారులు, అడ్తీదారులతో మార్కెటింగ్ సిబ్బంది కుమ్మక్కై ఎలక్ట్రికల్ తూకం ద్వారా మిర్చిని తూకం వేసినప్పటికి ఎలాంటి బిల్లు ఇవ్వకపోవడంతో ఆన్‌లైన్ నమోదు చేయరు. దీంతో రైతులకు తక్‌పట్టి ఇవ్వరు. రిజిస్టర్‌లో నమోదు చేయరు. ఇలా ప్రతీ రోజు మార్కెట్‌కు వచ్చే మిర్చిలో 35శాతం నుంచి 40శాతం వరకు పంటలను రికార్డుల్లో చేర్చకుండా వ్యాపారులు బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ జీరో కాంటాలతో మార్కెట్, ప్రభుత్వ ఆదాయానికి దళారులు, అధికారులు, వ్యాపారులు గండి కొడుతున్నారు. ఇక కంప్యూటర్ బిల్లుకు బదులుగా తెల్లకాగితాలపైనే కొనుగోలు లెక్కలను రాస్తున్నారు. కోడ్ భాషలో క్వింటాళ్లు, ఇవ్వాల్సిన డబ్బులు తదితర వాటిని నమోదు చేసి రైతులకు తెల్లకాగితాలను ఇస్తున్నారు. వీటితో పాటు మార్కెట్‌కు వచ్చే తాలు మిర్చి, తక్కువ రకం మిర్చికైతే జీరో కాంటాలు వేస్తున్నారు. ఈ తెల్లకాగితాలను అడ్తీదారుడు తీసుకుని.. తన కమీషన్‌ను కట్ చేసుకున్నాకనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నారు. ఇక్కడ రైతులకు అన్యాయం జరగకున్నప్పటికీ.. ప్రభుత్వానికి రావాల్సిన జీఎస్టీ, సెస్‌లను వ్యాపారులు ఎగవేస్తున్నారు. రైతు నుంచి కొనుగోలు చేసే పంటలపై ఖరీదుదారుడు మార్కెట్‌కు 1 శాతం సెస్, ప్రభుత్వానికి 5శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే సెస్, జీఎస్టీ రూపంలో 6శాతం చెల్లించాల్సి వస్తుండటంతో ఖరీదుదారులు ఇలా అడ్డదారులు తొక్కుతున్నారు. అంతేకాకుండా రైతుల నుంచి భారీగా మిర్చి కొనుగోలు చేసినా తక్కువ కొనుగోలు చేసినట్లుగా నామమాత్రంగా చూపించి రశీదులు ఇస్తున్నారు. గతేడాది నకిలీ తక్‌పట్టీలతో వ్యాపారులు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించారు. భారత్ ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారి మార్కెట్‌లో జీరో కాంటాలు నిర్వహిస్తూ దొరికితే మార్కెటింగ్ ఉద్యోగులకు మెమో, వ్యాపారిని పది రోజులు సస్పెండ్ చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. దీంతో అక్రమాలకు పాల్పడే వ్యాపారులకు ఎలాంటి భయం లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమ దందాకు తెరతీస్తున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ జాడేదీ?

మిర్చి కొనుగోళ్లలో జీరో దందా ఒక్క వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోనే కాదు.. అన్ని చోట్ల ఇదే జరుగుతోంది. రైతుల నుంచి ఫిర్యాదు వచ్చిన అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్, ఖమ్మం,

మిగతా 6వ పేజీలో...

అడ్తిదారుల కమీషన్ దందా

రైతుల అమాయకత్వాన్ని, అవసరాలను అసరాగా తీసుకుని ఖరీదుదారులు, అడ్తీదారులు అందినంత దోచుకుంటున్నారు. రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చిని తూకం వేసేందుకు హమాలీ, తూకం ఖర్చులు రైతులే భరిస్తారు. వీరితో పాటు మార్కెట్‌లో చోటామోటా దాదాలు బెదిరించి బస్తాకు ఇంత అంటూ వసూళ్లకు దిగుతున్నారు. వీరి బాధ నుంచి బయట పడగానే అడ్తీదారుల దందా మొదలవుతుంది. ఖరీదుదారుడు రైతుల నుంచి మిర్చిని కొనుగోలు చేసిన తరువాత 15రోజుల్లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఖరీదుదారుడి చుట్టూ మిర్చి డబ్బుల కోసం రైతులు తిరగడం కుదిరే పనికాదు. దీంతో అడ్తీదారులే ఆ మొత్తాన్ని రైతులకు చెల్లిస్తారు. అయితే రూ.100కు రూ.2 కట్ చేసుకుని రైతుకు ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉండగా, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని రూ.100కు నాలుగైదు రుపాయల చొప్పున కోత పెట్టి డబ్బులు చెల్లిస్తున్నారు. రైతుకు మిర్చి విక్రయిస్తే రూ.50వేలు వస్తే అందులో నుంచి 5శాతం కట్ చేసుకుని రూ.47,500 ఇస్తున్నారు. ఇదేందని రూ.2లే తీసుకోవాలని నిబంధన ఉంది కదా అని రైతులు ప్రశ్నిస్తే.. వేరే వ్యాపారి వద్ద మిర్చిని అమ్ముకోండని సలహా ఇస్తున్నారు. ఇలా రోజూ రూ.కోట్లలో మిర్చి కొనుగోళ్లలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మార్కెటింగ్ అధికారులు, వ్యాపారులు, అడ్తీదారులు కుమ్మక్కై రూ.లక్షల్లో ఆదాయానికి కన్నం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మేడారం పూజారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం



ఐటీడీఏలో పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీ.ఎస్

ఏటూరునాగారం రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): 2026లో జరగనున్న మేడారం మహాజాతర నిర్వహణపై కలెక్టర్ దివాకర టీ.ఎస్ సమ్మక్క- సారలమ్మ పూజారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బుధవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాలు సంయుక్తంగా ఎండోమెంట్ ఏవో రాజేందర్, సమ్మక్క- సారలమ్మ పూజారులు కాకా వెంకటేశ్వర్లు, సిద్దబోయిన మునిందర్, చందా రఘుపతి, దబ్బకట్ల ప్రభాకర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూజారుల గత మేడారం జాతరల అనుభవాలను వారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 2026 జాతరకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాల కల్పనతో పాటు జాతర విజయవంతానికి అనుసరించవల్సిన వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా మేడారం పూజారుల అసోసియేషన్ ఏర్పాటుపై ప్రతిపాదనలు కోరడం జరిగిందని, రాబోయే మహాజాతరను దిగ్విజయంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లోనే..

- ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

వెంకటాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కంపెనీల బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లోనే పరిహారం పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టామని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం మండలంలోని యోగితానగర్ గ్రామంలో ఆయన పర్యటించి బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పంట సాగుకోసం ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత నష్టపోయారనే విషయాలను బాధిత రైతులను అడిగి తెలుసుకు న్నారు. పెట్టుబడి పోను మిగిలిన మొత్తం నష్టపరిహారం కంపెనీ ఇస్తుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలు నష్టపోయిన ప్రతి రైతు వద్దకు అధికారులు, కంపెనీ నిర్వాహకులు వచ్చి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి నష్టపరిహారం చెల్లిస్తారని అన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.



ఎంసీఏ పరీక్షలను పరిశీలిస్తున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

ఎంసీఏ పరీక్షలను పరిశీలించిన కేయూ వీసీ

కేయూ క్యాంపస్ మే 21, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆర్థికశాస్త్ర విభాగంలో పరీక్షల కేంద్రంలో నిర్వహిస్తున్న కేయూ ఎంసీఏ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ తీరును బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన వారిలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ తదితరులున్నారు.

ఏటూరునాగారం పరీక్షల కేంద్రంలో తనిఖీలు

కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల కేంద్రాలను వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటయ్యలు తనిఖీలు చేపట్టారు. బుధవారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాన్ని ఆకస్మికంగా అధికారులు సందర్శించి తనిఖీలు చేపట్టారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను గదుల్లోకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల జేబులలో నకలు ఉన్నాయని పరిశీలించారు. అలాగే భూపాలపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. కాగా, బుధవారం బీఏ, బీకామ్, బీఎస్సీతోపాటు ఇతర పరీక్షల రెండో సెమిస్టర్‌లు జరిగాయి.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి



వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 16 సర్కిళ్లలోని డీఈ, ఏడీఈ, ఏఈలతో సీఎండీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఎల్సీ యాప్ (లైన్ క్లియరెన్స్)ను తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది పనిచేసే సమయంలో ఒక ప్రణాళిక ప్రకారం సమన్వయంతో అత్యంత సాంకేతికంగా ఉండేందుకు యాప్‌ను తీసుకువచ్చామన్నారు. దీని ద్వారా అనవసరమైన ఎల్సీలు తగ్గించవచ్చన్నారు. ఒక ఫీడర్‌పై పదేపదే ఎల్సీలు తీసుకోకుండా సమన్వయంతో ఒకే సమయంలో తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ అంతరాయాల సమయం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు టి.మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, అశోక్, జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సీపీ అభినందన



కానిస్టేబుల్ స్పందనకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో రాణించిన ఏఆర్ మహిళా కానిస్టేబుల్ జి.స్పందనను బుధవారం సీపీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు. గత నెల పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన పోటీల్లో ఫెన్సింగ్ క్రీడలు ఉమెన్ విభాగంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన స్పందన కాంస్య పతకాన్ని సాధించింది. ఈ మేరకు బుధవారం సీపీని మర్యాదపూర్వకంగా కలవగా ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు ప్రత్యేక పోత్సహకాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ రవి, ఏఆర్ ఏసీపీ అంతయ్య పాల్గొన్నారు.

విశిష్టం.. వైవిధ్యం..

ఉమ్మడి వరంగల్ జిల్లా సొంతం





- దట్టమైన అడవులు.. గొలుసుకట్టు చెరువులు..
- ఎటుచూసినా కొండల వరుసలు.. పలురకాల పక్షులకు ఆవాసాలు
- పరిరక్షణ లేక కలుగుతున్న నష్టం.. పర్యావరణంపై ప్రతికూల ప్రభావం
- నేడు ప్రపంచ జీవ వైవిధ్య దినం

హనుమకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా విశిష్టమైన జీవ వైవిధ్యానికి నెలవు. దట్టమైన అడవులు, అనేక చెరువులు, ఎటుచూసినా కొండల వరుసలు, పలు రకాల పక్షుల కిలకిలా రావాలు, వివిధ రకాల జంతువులకూ ఆలవాలంగా ఉంటోంది. హైదరాబాద్ వంటి నగరాలతో పోల్చితే ఇక్కడ వాతావరణ కాలుష్యం తక్కువే. అయితే మారుతున్న కాలమాన పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, శరవేగంగా పట్టణీకరణ, ఆ మేరకు అనేక రేట్లు పెరిగిన వాహనాలు పర్యావరణనపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. తత్ఫలితంగా జీవ వైవిధ్యం క్రమంగా దెబ్బతింటోంది. రక్షణ చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్‌లో జీవవైవిధ్యం, పరిరక్షణ చర్యల లేమి వల్ల కలుగుతున్న నష్టంపై ప్రత్యేక కథనం.

ఏటూరునాగారం అభయారణ్యం

ఉమ్మడి జిల్లాలోని జీవవైవిధ్యానికి ప్రత్యక్ష నిదర్శనం ములుగు జిల్లా ఏటూరునాగారంలోని వన్యప్రాణుల అభయారణ్యం. 806 చ.కి.విస్తీర్ణంలో ఉన్న ఈ అభయారణ్యం జంతు, వృక్షజాతుల సంరక్షణ కేంద్రంగా విలసిల్లుతోంది. దట్టమైన అటవీప్రాంతం. ఎన్నో జంతు జాలాలకు నిలయంగా ఉంది. పెద్దపులి, చిరుతపులి, అడవిదున్న, కడితి, దుప్పి, మనోబోతు, క్రిష్ణ జింక, కొమ్ముల జింక, మొరుగు జింక, అడవి పంది, తోడేలు, నక్క, అడవిపిల్లి తదితర జంతువులు ఇందులో ఉన్నాయి. అనేక అరుదైన జాతి చెట్లను ఇక్కడ చూడవచ్చు. టేకు వృక్షాలకు ప్రసిద్ధి. వెదురు, మద్ది, చిరుమానుతో పాటు రకాల చెట్లు విస్తారంగా ఉన్నాయి. ఈ అడవి అనేక వాగులు, నీటిబుగ్గలు, కొండలతో ఉంది. గోదావరి నది అభయారణ్యం గుండా వెళుతుంది. 60అడుగులు అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ఇతర మంచి నాణ్యత గల చెట్లను ఇక్కడ చూడవచ్చు.

పాకాల

ఉమ్మడి జిల్లాలోని మరో అభయారణ్యం పాకాల. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల సరస్సు తీరానికి దగ్గరగా 839 కి.మీ.మేర ఈ అడవి విస్తరించి ఉంది. వివిధ రకాల వన్యప్రాణులకు ఆవాసంగా ఉన్న ఈ అభయారణ్యం పలు రకాల జంతువులకు ఆవాసంగా ఉంది. పులులు, చిరుత పులులు, మొసళ్లు, ఎలుగుబంట్లు, హైనాలు, కొండ చిలువలు, తోడేళు వంటి జంతువులు సంచరించే ఈ అడవిలో వివిధ రకాల పక్షులకు కూడా ఆలవాలం. వివిధ సహజ వృక్షాలతో సమృద్ధిగా కనిపించే పాకాల అభయారణ్యం ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఒకటి.

ఇనుపరాతి గుట్టలు

హనుమకొండ జిల్లా కేంద్రానికి 20 కి.మీ.దూరంలో ఉన్న ఇనుపరాతి గుట్టలు కూడా జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో 4,866 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ గుట్టలోల ఎన్నో ఔషధ మొక్కలు, రకరకాల చెట్లు, జంతువులతో పాటు విలువైన ఖనిజ నిక్షేపాలు కూడా ఉన్నాయి. ఈ ఇనుపరాతి గుట్టలను ఏకోటూరిజం పార్క్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రకృతి అందాలకు నిలయమైన ఈ గుట్టల్లో అడుగడుగునా జీవవైవిధ్యం కనిపిస్తుంది. ఈ గుట్టల్లో బలపాలొద్ది, తీగలొద్ది, జాలురా అనే మూడు జలపాతాలు కూడా ఉన్నాయి. ఆరు ఎకరాల్లో బట్టర్‌ఫ్లై జోన్ కూడా ఉంది. గతంలో ఇక్కడ ఏనుగులు సంచరించేవని చెబుతారు.

కిలకిలా రావాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5823 చెరువులు ఉన్నాయి. వీటిలో పెద్దవి 138 వరకు ఉన్నాయి. గొలుసుకట్టు చెరువులకు ఈ జిల్లా ప్రసిద్ధి. కాకతీయుల కాలంలో తవ్వించిన ఈ చెరువుల వల్లనే విశిష్టమైన జీవ వైవిధ్యం నెలకొన్నది. నిత్యం నీటితో కలకలాడుతూ కనిపించే చెరువులు, చుట్టూ పరుచుకున్న పచ్చదనంతో స్థానికంగా ఉండే పక్షులేకాకుండా ఏటా వివిధ దేశాల నుంచి అనేక రకాల అరుదైన పక్షులు ఇక్కడి వస్తున్నాయి. పాకాల, లక్నవరం, గణపురం వంటి పెద్ద చెరువులతో పాటు ధర్మసాగర్, భద్రకాళి, వడ్డెపల్లి బంధం, అమ్మవారిపేట వంటి అనేక చిన్న చెరువులు ఈ పక్షులకు ఆవాసంగా ఉంటున్నాయి. ఫారెస్ట్ వాగ్‌టేయిల్, బ్లాక్ బజా, లగర్ పాల్కన్, డస్కీ, ఈగల్ ఔల్, స్పాట్ బెల్లీడ్ ఈగల్ ఔల్, స్మాల్ ప్రాటిన్‌కోల్, రెడ్ క్రస్టెడ్ పోచార్డ్, కామన్ కింగ్ పిషర్, బ్లాక్ షోల్డర్ కైట్, ఇండియన్ కార్మోరన్ట్ ఎల్లో ఫ్రూటేడ్ గ్రీన్ పిజియన్ మొదలైన పక్షులు ఈ చెరువుల వద్ద చూడవచ్చు. దాదపు 280 రకాల పక్షలు ఇక్కడ కనిపిస్తుంటాయి. వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట పెద్ద చెరువు వద్ద ఇటీవల రెండు అరుదైన పక్షులను పక్షి ప్రేమికులు కనుగొన్నారు. అనేక రకాల పక్షులు నివాసముంటున్న ఈ ప్రాంతాన్ని పక్షిరక్షిత ప్రాంతంగా ప్రకటించే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. తాడ్వాయి, ములుగు, వెంకటాపురం, గణపురం, రామప్ప, పాకాల, లక్నవరం తదితర ప్రాంతాల్లో అలెగ్జాండ్రిన్ ప్యారకిట్, ఓరియంటల్ డార్టర్, బ్లాక్ హెడెడ్ హైబీస్, రివర్ టర్న్ తదితర 122 రకాల పక్షులను గుర్తించినట్లు ఫారెస్ట్ కాలేజ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని పరిశోధక విద్యార్థులు తెలిపారు. అయితే ఇసుక తవ్వకాలు, సింగరేణి బొగ్గు కార్యకలాపాలు, కాలుష్యం వంటి చర్యలు పక్షుల మనుగడపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. పంటపొలాల్లో వాడుతున్న క్రిమిసంహారకాలు పక్షులకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో మరో 122 రకాల పక్షులు కనిపించాయి. వీటిలో మూడురకాల పక్షులపై పర్యావరణ మార్పుల ప్రభావం పడుతోంది.



అరుదైన కేన్ మొక్కలు

ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట శివారు రామప్ప ఆలయం సమీపంలో ప్రపంచంలోనే అరుదైన కేన్ మొక్కలు ఉన్నాయి. అంతరించిపోతున్న వెదురు జాతుల్లో ఇది ఒకటి. స్థానికంగా సాప తీగ బరిగే అని పిలుచుకునే ఈ కేన్ మొక్కలు ఒక్క పాలంపేటలో తప్ప మరెక్కడ కనిపించవు. దీంతో 1974లో ఈ ప్రాంతాన్ని అటవీ శాఖ జీవవైవిధ్య పరిరక్షణ ప్రాంతంగా గుర్తించింది. అయినా ఈ ప్రాంతం ఆక్రమణకు గురవుతోంది. పంటల సాగు కోసం ఈ మొక్కలను క్రమంగా తొలగిస్తున్నారు.

పరరిక్షణ చర్యలేవి?

ఉమ్మడి జిల్లాలోని జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. స్మగ్లర్లు చెట్లను నరికివేస్తుండడంతో అడవులు అంతరించిపోతున్నాయి. వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. దీంతో జంతుజాలాలు క్రమంగా నశించిపోతున్నాయి. ఆక్రమణలు, అక్రమ కట్టడాల నిర్మాణాల వల్ల చెరువులు అదృశ్యం అవుతున్నాయి. దీంతో పర్యావరణంపై ప్రతికూల ప్రభావంతో జీవవైవిధ్యం ప్రమాదంలో పడే పరిస్థితులు నెలకొన్నాయి. జనాభా గణనీయంగా పెరగడంతో, వాహనాల వినియోగం కూడా అంతకంతకూ అధికమై వాతావరణ కాలుష్యానికి కారణమవుతోంది.



35 మంది నక్సల్స్ ఎన్‌కౌంటర్‌ను ఖండించండి

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మహబూబాబాద్, మే 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు 34 మంది మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్నారు. మహబూబాబాద్ ఆంధ్రజ్యోతి కార్యాలయానికి బుధవారం పంపిన ప్రకటనలో పలు అంశాలను పేర్కొన్నారు. యేడాదికాలంగా మధ్యభారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్‌లను కొనసాగిస్తోందని చెప్పారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్‌లో ప్రభుత్వ బలగాలు జరిపిన కాల్పుల్లో సీపీఐ మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఆలియాస్ బస్వరాజ్‌తో పాటు 34 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారని చెప్పారు. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని మేధావులు, ప్రజాస్వామికవాదులు, మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పట్టించుకోవడం లేదన్నారు. పైగా మధ్యభారతంలో నరమేధాన్ని తీవ్రతరం చేస్తున్నారని చెప్పారు. మావోయిస్టులపేరుతో దేశపౌరులను ఎన్‌కౌంటర్ చేసి, ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించి అటవీ సంపదను బడా కార్పోరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి పారా మిలిటరీ బలగాలను వెనక్కి రప్పించాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఉరివేసుకుని వలస కూలీ మృతి



హసన్‌పర్తి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని వలస కూలీ మృతి చెందిన ఘటన బుధవారం ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులో చోటు చేసుకుంది. కేయూ ఎస్సై బొజ్జ రవిందర్ కథనం ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అక్బర్‌పూర్ మునిసిపాలిటీకి చెందిన అజిత్ కుమార్ (24) బతుకు దెరువు కోసం ఎర్రగట్టుగుట్ట ప్రాంతానికి వచ్చి విజయ్‌కుమార్ వద్ద కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం కూలీ పనులు ముగించుకొని తననివాసానికి చేరుకొని సమీపంలోని వైన్‌షాపులో ఉదయం నుంచి మద్యం సేవిస్తున్నట్లు తోటి కూలీలు చెబుతున్నారు. ఇంతలో ఏం జరిగిందో కానీ మద్యం మత్తులోనే తాను నివాసం ఉంటున్న గదిలో తన కుటుంబ సభ్యులతో వాట్సాప్ కాల్ చేసుకుంటూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతిచెందినట్లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన తోటి కూలీలు చెబుతున్నారు. మృతుడికి భార్య 3 నెలల కూతురు ఉంది. విషయం తెలిసిన కేయూ ఎస్సై బొజ్జ రవిందర్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సమస్యలతోపాటు ఆర్థిక సమస్యలే అజిత్‌కుమార్ మృతికి కారణం కావచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గుత్తేదార్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ ఎస్సై బొజ్జ రవిందర్ తెలిపారు.

ఇస్రో కోఆర్డినేటర్లుగా జితేందర్, సరిత నియామకం



ఎల్. జితేందర్ ఎ. సరిత

వరంగల్ ఎడ్యుకేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) వరంగల్ జిల్లా ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా ఆర్ట్స్ కళాశాలలోని ఇద్దరు అధ్యాపకులు డాక్టర్ ఎల్.జితేందర్, డాక్టర్ ఎ.సరితలను నియమిస్తూ ఇస్రో చైర్మన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.జితేందర్, డాక్టర్ ఎ.సరితలు ఇస్రో ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా ఎంపికైనందుకు వారిని అభినందించారు.

తూనికలు, తూకాలను గమనించాలి

- జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత
- కూరగాయాల మార్కెట్‌లో అవగాహన కార్యక్రమం



బాలసముద్రం కూరగాయల మార్కెట్‌లో తూనికలు, తూకాలను తనిఖీ చేస్తు న్న అధికారి శ్రీలత

హనుమకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు మార్కెట్‌లో నిత్యావసరాలు కొనుగోలు చేసేప్పుడు తూనికలు, తూకాలు సరిగా ఉన్నాయా లేవా అనేది గమనించాలని, ఒకవేళ లేకుంటే వ్యాపారులను నిలదీయంతోపాటు ఆ విషయాన్ని తూనికలు, కొలతల అధికారులకు తెలియచేయాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కూరగాయలు, చేపల మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ నిబంధనలపై వినియోగదారుల మండలి, లీగల్ మెట్రాలజీ శాఖ సంయుక్తంగా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. తమ తూనికలు కొలతల శాఖ తూకపు రాళ్లు, కాంటాలను రెండేళ్లకోసారి అలాగే ఎలక్ట్రానిక్ కాంటాలను యేడాదికోసారి సరిచూసి ముద్రలు వేస్తుందని అన్నారు. బంగారు, వెండి ఆభరణాల అమ్మకందారులు రశీదులపై తప్పని సరిగా వాటి నాణ్యతా ప్రమాణాలను పేర్కొనాలని, లేకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో బంగారు ఆభరణాల పరీక్షా కేంద్రం లేనందువల్ల లీగల్‌మెట్రాలజీ అధికారులు శాంపిల్స్ సేకరించడం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో వస్తువు అయినా ఎంఆర్‌పీ ధరకన్నా ఎక్కువ అమ్మకం జరిగితే లీగల్ మెట్రాలజీ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కార్పొరేషన్ చీఫ్ హెల్త్ ఆఫీసర్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. మాంసంపై కార్పొరేషన్ కబేళాలలో వెటర్నరీ అధికారి ముద్ర తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రదాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. గతంలో అన్ని రకాల తూకాలు, కాంటాలకు యేడాదికోసారి ముద్రలు వేసేవారని, ఇప్పుడు రెండేళ్లకోసారి వేయడంవల్ల అవి అరిగిపోయి తక్కువ తూకం వస్తుండడంతో వినియోగదారులు మోసపోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావుల రంజిత్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగరాజు సతీష్, శ్రీరామోజు శ్రీనివాస్, నగర కార్యదర్శి దామెర శ్యామ్, వివిధ విభాగాల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ రూల్స్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు.

మిర్చి.. జీరో దందా!

(5వ పేజీ తరువాయి)

కేసముద్రం వ్యసాయ మార్కెట్లకు భారీగా మిర్చి అమ్మకానికి వస్తాయి. ఈ మూడు మార్కెట్ల నుంచే సెస్ రూపంలో సుమారు రూ.100 కోట్ల అదాయం లభిస్తుంది. అయితే ఈ-నామ్ ప్రకారం ప్రతీ వ్యవసాయ మార్కెట్‌లో అన్ని కొనుగోళ్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాలి. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఈ సీసీ కెమెరాలు అనుసంధానం చేస్తారు. ప్రతీ రైతు పేరు నమోదుతో పాటు ఎలక్ట్రికల్ తూకంలో వేసే మిర్చి బస్తాల సంఖ్య, మొత్తం ఎన్ని క్వింటాళ్లు, ఖరీదుదారుడు, అడ్తీదారుడు తదితర వివరాలన్నీ నమోదవుతాయి. దీంతో జీరో కాంటాలకు చెక్ పడుతుంది. అయితే నాలుగైదేళ్లుగా వరంగల్ వ్యసాయ మార్కెట్‌లో సీసీ కెమెరాలు పని చేయడం మానేశాయి. వాటిని మరమ్మతులు చేసే బడ్జెట్ లేక కాదు.. అక్రమ దందా బట్టబయలవుతుందనే సీసీ కెమెరాలను అందుబాటులోకి తేవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనుగోళ్లు చేస్తే ప్రస్తుతం వస్తున్న అదాయం 40శాతం పెరుగుతుందనే చర్చ జరుగుతోంది. ఏటా వరంగల్ వ్యవసాయ మార్కెట్ అదాయం సుమారుగా రూ.55 కోట్లు ఉంది. ఎలాంటి అవకతవకలు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియ చేపడితే వరంగల్ మార్కెట్ నుంచే రూ.1001 కోట్ల అదాయం వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గత ఏప్రిల్ 30వ తేదీన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జీరో కాంటాలపై దృష్టిపెట్టిన మార్కెటింగ్ అధికారులు రికార్డుల తనిఖీలు నిర్వహించారు. జీరో కాంటాలతో దళారులు, అధికారులు కుమ్మక్కయ్యారని.. మార్కెటింగ్ అధికారులు గుర్తించినట్లుగా తెలిసింది. కాగా, పత్తి కొనుగోళ్లలో తాత్కాలిక రశీదులు (టీఆర్)లతో సీసీఐ అధికారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు రూ.కోటలో అక్రమాలకు పాల్పడిన సంఘటన వెలుగులోకి రాగా, అదే తరహాలో మిర్చి కొనుగోళ్లలో జీరో కాంటాలతో రూ.కోట్ల అదాయం ప్రభుత్వానికి రాకుండా వ్యాపారులు, మార్కెటింగ్ అధికారులు కుమ్మక్కై అడ్డుపడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లపై విచారణ చేయిస్తే.. వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రైతులు పేర్కొంటున్నారు.



WANTED (F) TELECALLERS

★ Urgent requirement for Female Tele-Callers in Corporate DSA Office Salary + Incentives, etc., JOB Location : Hanamkonda. Cont : +91 8886426539, 9393113929

AJW-7657

WANTED

★ B.Sc నర్సింగ్ & GNM సిస్టర్స్, EMT and అనెస్థీషియా టెక్నీషియన్లు, సిస్టమ్ ఆపరేటర్లు, వార్డ్ బాయ్స్, ఆయాలు కావలెను. సం॥ప్ర॥ 9703377036, 7702686277

AJW-7656

WANTED

★ హన్మకొండలో గల ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం గల GNM ఫార్మసిస్ట్ మరియు మల్టిపర్పస్ మేనేజర్ (MBA) కావలెను. సం॥ప్ర॥ 8712608501, 9966068880

AJW-4093

WANTED

★ మడికొండ (ధర్మసాగర్) దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మంచి ఉత్సాహవంతులైన వర్కర్స్ కావలెను. సెల్ : 8247771016, 8247771525

AJW-4095

ఆఫీస్ అసిస్టెంట్ కావలెను

★ సెక్యూరిటీ గార్డుగా అనుభవం గల ఆఫీస్ అసిస్టెంట్ వెంటనే కావలెను, స్వంత వాహనం కలవారు, మరియు సెక్యూరిటీ గార్డు కావలెను జీతం : 10,000 నుండి 15,000 + ESI, EPF. సం॥ప్ర॥ 9848022608, 8978459111.

AJW-516

PLOT FOR SALE

★ హైద్రాబాద్ L.B. నగర్‌కు 30 కి.మీ. మహేశ్వరంలో ప్లాట్లు (శ్రీశైలం హైవే) యాదగిరి గుట్ట & నారాయణఖేడ్‌లో ప్లాట్లు కలవు. తక్కువ ధరలో. Cont.:9581478475

AJH-15177

PLOT FOR SALE

★ వరంగల్ నర్సంపేట రోడ్‌కి 8KM దూరంలో లక్ష్మీపురం గ్రామంలో కాడకనాథ్ ఫామ్‌లో 120 గజాల 6,00,000/- కే ఇస్తూ ప్రతి నెల ఆదాయం కొన్న వారికీ 6000 చొప్పున 100 నెలలు ఇవ్వబడును. 2,00,000/- డౌన్‌పేమెంట్‌తో సులభవాయిదాల పద్ధతిలో ఫ్లాట్ సొంతం చేసుకొనే అవకాశం. సం॥ప్ర॥ 9160127942

AJW-7655

గోదాం అమ్మబడును & కిరాయికి ఇవ్వబడును

★ కోమటిపల్లిలో (45x50) జిందాల్ రేకుల షెడ్డు మరియు 32x16 గల రేకుల షెడ్డు అమ్మబడును. లేదా కిరాయికి ఇవ్వబడును. సం॥ప్ర॥ 9151110456

AJW-237372

TUITIONS

★ Diploma, B. Tech & Degree (Regular/ Supply) Students. Advance Classes for B. Tech, Inter, Home Tuition also Available Kaleshwari Institute, Wgl. cell : 8125080314, 9032857572.

AJW-237316

CHANGE OF NAME

★ I, DEVULAPALLY GIRIJA (Old Name) H.No: 55-3-351/1/2, Surabhi Venture, Shiva Sai Colony, Bheemaram, Gopalpur, Hanamakonda T.G. have Chnaged my Name from DEVULAPALLY GIRIJA to SUNANDA GIRIJA (New Name), W/o. DEVULAPALLY RAMESH RAO in all my Records.

AJW-237325

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



నదీ స్నానం చేస్తున్న భక్తులు



కాళేశ్వరంలోని పుష్కరఘాట్‌లో భక్తుల రద్దీ



త్రిలింగ క్షేత్రం.. పుష్కర శోభితం..



పుష్కరఘాట్ సమీపంలో పార్కింగ్‌కు క్యూ కట్టిన ప్రైవేటు వాహనాలు

కాళేశ్వరంలో ఉత్సాహంగా సాగుతున్న సరస్వతీ పుష్కరాలు

- భక్త జన సంద్రమవుతున్న త్రివేణి సంగమం
- ఏడోరోజున లక్ష మందికిపైగా పుణ్యస్నానాలు
- జనం రద్దీతో కిటకిటలాడిన బస్సులు
- అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్

కాళేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న త్రిలింగ క్షేత్రం.. కాళేశ్వరం పుష్కర శోభితమై వెలుగులీనుతోంది. వేలాదిగా తరలొస్తున్న భక్తజనంతో త్రివేణి సంగమం సందడిగా మారింది. సరస్వతి పుష్కరాల్లో ఏడో రోజైన బుధవారం భక్తులు అధిక సంఖ్యలో పుష్కర స్నానానికి తరలివచ్చారు. మంగళవారం కాస్త రద్దీ తగ్గినా.. బుధవారం మళ్లీ పెరిగింది. అధికారుల అంచనా ప్రకారం బుధవారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్టు అంచనా. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలివస్తుండటంతో రహదారులన్నీ కాళేశ్వరం వైపే అన్నట్టుగా ఉంది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో సరస్వతీ మాతకు చీరు, సారె, పూలు, పండ్లు, దీపాలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పణాలు వదిలారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కూడా పూర్తిస్థాయిలో నిండుతుండగా.. సుమారు 500కుపైగా ట్రిప్పులతో ఆర్టీసీ భక్తులను పుష్కరాలకు చేర్చింది. సుమారు 10వేల ప్రైవేట్ వాహనాలు సైతం కాళేశ్వరం తరలొచ్చాయి. తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సంఖ్య రద్దీగా ఉండడంతో అధికార యంత్రంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పాలిచ్చే తల్లులకు ప్రత్యేకంగా ఫీ, ఫీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్‌కు వెళ్లేందుకు అధిక సంఖ్యలో ఉచిత బస్‌లను అందుబాటులో ఉంచారు. భక్తుల రద్దీ కారణంగా మూడు రోజుల క్రితం ఉత్పన్నమైన ట్రాఫిక్ సమస్యలు పునరావృతం కాకుండా అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి అన్నారం క్రాస్ రోడ్డు నుంచి పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండు వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అటు తీవ్రమైన ఎండలు, ఇటు అకాల వర్షంతో రోడ్లన్నీ బురదమయమై భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండవేడిమికి తోడు ఉక్కపోత అధికంగా ఉండడంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసింది. మరో వైపు సింగరేణి మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా అందించారు. జిల్లా యంత్రాంగం కంటైనర్ల ద్వారా తాగునీటిని అందజేసింది. గోదావరిలో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని మోహరించి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అలాగే ఆలయం వద్ద వయోవృద్ధులకు స్వామివారి దర్శనం కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్‌లను అందుబాటులోకి తెచ్చారు. వచ్చే నాలుగైదు రోజుల్లో భక్తులు మరింత పెరిగే అవకాశం ఉండడంతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించారు.



కాళేశ్వర దర్శనానికి వస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కుమార్

పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతి పుష్కరాల్లో బుధవారం బెల్లంపల్లి శాసనసభ్యుడు, మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు, ఎస్పీ కిరణ్‌ఖరే లు అంతర్వాహినిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అకాలవర్షంతో భక్తులకు ఇబ్బందులు

బుధవారం మధ్యాహ్నం కాళేశ్వరంలో కురిసిన అకాల వర్షంతో పుష్కరాలకు తరలివచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. పుష్కర ఘాట్‌లకు వెళ్ళేరోడ్‌లతో పాటు తాత్కాలిక బస్టాండ్ బురదమయం కావడంతో కాలినడకన వెళ్ళే భక్తులు సమస్యలు ఎదుర్కొన్నారు. అటు పుష్కరఘాట్ ల వద్ద టెంట్ సిటీ ప్రాంగణమంతా బురదతో అస్థవ్యస్థంగా మారింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో గంటపాటు విద్యుత్ సేవలకు అంతరాయం కలిగింది.

అకాల వర్షం.. భక్తుల అవస్థలు..



వర్షంలో రద్దీగా వెళుతున్న వాహనాలు

కాళేశ్వర క్షేత్ర పరిధిలో బుధవారం సాయంత్రం అకాల వర్షం కురియడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పుష్కర ఘాట్, తాత్కాలిక బస్టాండ్లకు వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. పుష్కర స్నానం చేసి దేవాలయానికి వచ్చేభక్తులు వర్షంలో తడిచారు. వంటలు చేసుకుని భోజనాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కలెక్టర్ రాహుల్ శర్మ.. యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వచ్చే రెండు మూడు రోజుల్లో గాలిదుమారాలు, ఈదురు గాలులతో కూడిన వర్షం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సింగరేణి రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే అన్ని బృందాలతో సమన్వయం ఉండేలా వాకీటాకీల ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకునే ఏర్పాట్లుచేశారు.

సరస్వతీ పుష్కరం.. సేవే ప్రధానం!

- స్వామివారి సేవలో వివిధ ప్రాంతాల వలంటీర్లు
- ఆధ్యాత్మికతతో ఎనలేని ఆనందం

కాళేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరం.. సేవే ప్రధానమంటున్నారు పలువురు వలంటీర్లు.. భక్తులకు చేసే సేవలో దైవాన్ని వెతుక్కుని ఆనంద పడుతున్నామంటున్నారు. ఒక్కో రోజు ఒక్కో కమిటీ ద్వారా రోజుకు కొన్ని వందల మంది వలంటీర్లు భక్తులకు సేవలందిస్తున్నారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయంతో పాటు ఆలయ పరిసరాల్లో సేవలో నిమగ్నమైన పలువురు వలంటీర్లు తమ అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

భగవంతుడి సేవగా భావిస్తున్నా..



నేను కొన్నేళ్లుగా దైవసేవకు వెళ్తున్నా. తిరుపతి, యాదాద్రి, ధర్మపురి దేవస్థానాల్లోనూ భక్తులకు సేవలందించా. భక్తులకు చేసే సేవే భగవంతుడు నాకు కల్పించిన అవకాశంగా భావిస్తున్నా. చాలా ఆనందంగా ఉంది.

- రమాదేవి, బావుపేట్

వసతులన్నీ దేవాదాయ శాఖవారే కల్పించారు



చాలా సార్లు స్వామి వారికి సేవకు వచ్చాం. సరస్వతీ పుష్కరాల్లో భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది. అధికారులే భోజన సదుపాయాన్ని కల్పించారు. మూడు రోజులపాటు సేవలందిచడానికి వచ్చా. ఇది ఆ భగవంతుడు నాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా.

- సరిత, పెద్దపల్లి

80మందికిపైగా వచ్చాం..



సరస్వతీ పుష్కరాల్లో భక్తులకు సేవలందించేందుకు శ్రీవల్లి సేవా సంస్థ ద్వారా సుమారు 80మందికి పైగా వచ్చాం. మాలో కొంత మంది ఒకరోజు, ఇంకొంత మంది మూడురోజులు సేవలందిస్తున్నాం. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాయలంలో సేవ చేయడం ఎంతో తృప్తినిస్తోంది.

- రంగు వాణి, పెద్దపల్లి



బస్టాండ్ నుంచి నదీ స్నానానికి వెళుతున్న భక్తులు



హారతినిస్తున్న కాశీ పండితులు

వైభవంగా నవరత్న హారతి

కాళేశ్వరం, మే 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని మంగళవారంరాత్రి 7:20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితు లు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, పలు శాఖల అధికారులు, వందలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువుగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు నిర్వహించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నదీమాతకు నమస్కరిస్తున్న భక్తులు



క్యూలైన్లలో భక్తులకు మంచినీరందిస్తున్న సేవకురాలు

పాటమ్మతోనే ప్రయాణం

- బాల్యం నుంచే గాయకుడిగా ప్రస్థానం
- 800లకు పైగా ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు
- గిన్నిస్ వరల్డ్ రికార్డులోనూ స్థానం పొందిన దామెర విక్రమ్



దూరదర్శన్ పాటల పల్లకీలో పాడుతున్న విక్రమ్

హనుమకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి) : సంగీతం పట్ల అభిమానం, అభిరుచి, అనురక్తి కలిగి ఉన్న వ్యక్తి దామెర విక్రమ్. అందువల్లే బాల్యం నుంచే పాటమ్మతో ప్రయాణం చేస్తూ 800లకుపైగా ప్రదర్శనలిచ్చి వాయిస్ ఆఫ్ హైదరాబాద్, గోల్డెన్ వాయిస్ ఆఫ్ హైదరాబాద్ లాంటి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. దూరదర్శన్‌లో పాటలపల్లకి, ఆలాపన లాంటి జనరంజక కార్యక్రమాల్లో పాడి లక్షలాది మంది శ్రోతలను ఆకట్టుకోగలిగారు. వరంగల్ అందించిన ఆణిముత్యాల్లో ఒకరైన విక్రమ్ స్వస్థలం వరంగల్‌లోని మట్టెవాడ. విక్రమ్ తల్లిదండ్రులు దామెర్ల వెంకటేశ్వర్లు, అన్నపూర్ణల సొంతూరు కొడకండ్ల కాగా బతుకుదెరువు కోసం వరంగల్‌కు వచ్చి స్థిరపడ్డారు. విక్రమ్ కెంబ్రిడ్జి గ్రామర్ హైస్కూల్‌లో పాఠశాల విద్యనభ్యసించిన ఆయన వివిధ విద్యాసంస్థల్లో ఇంటర్, బీఫార్మసి, ఎంఫార్మసి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు భార్య లక్ష్మీప్రసన్న, కూతురు ఉండగా.. భార్య దంతవైద్యురాలిగా ఉన్నారు. మధ్యతరగతి కుటుంబం కావడంతో విక్రమ్ ఓ వైపు ఉద్యోగం చేస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటూ.. చిన్ననాటి నుంచి గాయకుడుఎ కావాలన్న లక్ష్యాన్ని మాత్రం వదల్లేదు. పాటకు అడ్డంకి ఏదీ లేదు అన్న రీతిలో వృత్తిని ప్రవృత్తిని బ్యాలెన్స్ చేసుకుంటూ గాయకుడిగా రాణిస్తున్నారు. ఉద్యోగ ఒత్తిడితో కొద్ది రోజులు పాటను దూరంగా పెట్టినా... మళ్లీ పాట వెంట పరుగెడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో తనకు ఎదురైన అనేక అనుభవాలు, అనుభవం నేర్పిన పాఠాలతో గాయకుడిగా మరింత ఎదిగారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరిని ఆకట్టుకునేలా, అద్భుతంగా పాడాలంటే శాస్త్రీయ సంగీత పరిజ్ఞానం ఉండాలని తెలుసుకుని.. అప్పటి వరకు చూసి పాడడటం నేర్చుకున్న విక్రమ్.. వరంగల్ విద్యారణ్య సంగీత, నృత్య కళాశాలలో చేరి కర్ణాటక గాత్రంలో డిప్లొమా చేశారు. ప్రస్తుతం ఇదే కళాశాలలో పీజీ చేస్తున్నారు. వరంగల్ కొత్తవాడలోని ఇన్నర్‌వీల్ క్లబ్ రైసింగ్‌సన్ మ్యూజిక్ అకాడెమీలో ఎర్రం కర్నాకర్ వద్ద కర్ణాటక సంగీతంలో శిక్షణ తీసుకుంటున్నారు.



విక్రమ్‌ను సన్మానిస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

జానపదం వైపు కూడా..

పక్కా క్లాసికల్ సింగర్ అయిన విక్రమ్ ప్రస్తుతం జానపదం వైపు అడుగులు వేస్తున్నారు. ఫోక్ సాంగ్స్‌లో కూడా తన ప్రతిభను చాటేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జానపద పాటలకు ప్రజలు సులువుగా దగ్గరవుతున్న నేపథ్యంలో ఇందులోనూ రాణించేలా సాధన చేస్తున్నారు. విక్రమ్ ఇప్పటికే చాలా వేదికలపై క్లాసికల్‌తో పాటు ఫోక్ సాంగ్స్‌ను కూడా పాడుతున్నారు. విక్రమ్ ఆయా వేదికలపై ప్రోగ్రామ్స్ ఇవ్వడంతో పాటు తన మిత్రుడు వెంకట్ మ్యూజిక్‌లో మూడు, నాలుగు ఆల్బమ్స్‌లో కూడా పాడగా.. అవి వైరల్ అవుతున్నాయి. విక్రమ్ గిన్నీస్ వరల్డ్ రికార్డులో కూడా స్థానం సంపాదించాడు. చెన్నైలో 2020లో త్యాగరాజగాన సభ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో రైసింగ్ సన్ మ్యూజిక్ అకాడెమీ బృందంలో సభ్యుడిగా పాల్గొని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోకి ఎక్కాడు. ఇక విక్రమ్ పాటలు కూడా రాస్తాడు. 'అమ్మ.. ఓ అమ్మ.. నన్ను క్షమించు' అనే పాట రాసి ఔరా అనిపించారు. గాయకుడిగా ప్రజల హృదయాల్లో స్థిరపడిపోవాలన్న లక్ష్యంతో నిరంతర సాధన చేస్తున్నారు. రోజూ ఉదయం రెండు గంటల పాటు సంగీతాన్ని సాధన చేస్తున్నారు. అటు ఉద్యోగం ... ఇటు సంగీత సాధన... ఈ రెండు బ్యాలెన్స్ చేయడం కొంచెం కష్టమే అయినా పాట పట్ల తనకున్న అమితమైన ప్రేమతో అధిగమిస్తున్నట్టు చెబుతున్నారు విక్రమ్. ఇక తన పాటల ప్రయాణంలో కుటుంబం, ముఖ్యంగా తన భార్య సహకారం మరువలేనిదంటున్నారు. గాయకదిగ్గజాల సరసన నిలబడకలిగే స్థాయికి చేరుకోవాలంటే పాట ప్రస్థానంలో ఎక్కాల్సిన మెట్లు ఇంకా ఎన్నో ఉన్నాయంటున్న విక్రమ్ ఆ దిశగా మరింత బలంగా అడుగులు వేస్తున్నారు. పాటతో ప్రయాణిస్తున్న విక్రమ్ ప్రతిభను, సంగీత ప్రపంచంలో ఆయన కృషిని గుర్తించిన పలు సంస్థలు అవార్డులను ప్రదానం చేశాయి. ఆర్యవైశ్య సంఘం బెస్ట్ సింగర్ అవార్డును ప్రదానం చేసింది. పలు సాంస్కృతిక సంస్థలు ఘనంగా సత్కరించాయి. ఆయనకు వచ్చిన షీల్డ్‌లకు లెక్కేలేదు. విక్రమ్ ఇప్పుడు సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. త్వరలోనే తన కల నెరవేరాలచి ఆశిద్దాం.




హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీసెస్ నుంచి ప్రతిభారత్న పురస్కారం అందుకుంటున్న విక్రమ్



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజతో విక్రమ్

శాస్త్రీయ గీతాలాపనలో దిట్ట

విక్రమ్ శాస్త్రీయ గీతాలను అద్భుతంగా ఆలపిస్తారు. శాస్త్రీయ సంగీతంలో ఉన్న అనుభవంతో ఆయన పాడే పాటల్లో ఎక్కువగా సంప్రదాయ గీతాలే ఉంటాయి. అన్నమయ్య కీర్తలను, భక్తి పాటలను, సినిమా క్లాసికల్ సాంగ్స్‌ను అత్యంత మధురంగా ఆలపిస్తారు. మ్యూజికల్ నైట్స్, స్పెషల్ ఈవెంట్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్‌తో పాటు ఈవెంట్ ఆర్గనైజేషన్లు నిర్వహించే దాదాపు అన్ని ప్రోగ్రామ్‌లలో పాడుతున్న విక్రమ్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో, పొరుగు రాష్ట్రాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. అలా ఇప్పటి వరకు ఎనిమిది వందలకుపైగా స్టేజీ ప్రోగ్రామ్‌లలో పాల్గొన్న ఆయన తనను తాను నిరూపించుకునేందుకు పలు పోటీల్లో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో సీబీఐటీ ఏటా నిర్వహించే వాయిస్ ఆఫ్ హైదరాబాద్, గోల్డెన్ వాయిస్ ఆఫ్ హైదరాబాద్ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. దూరదర్శన్‌లో ప్రసారమ్యే పాటల పల్లకీ, ఆలాపన లాంటి కార్యక్రమాల్లో పలుసార్లు పాల్గొని తన పాటలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. సరిగమప ఆడిషన్‌కు సైతం వెళ్లిన ఆయన అత్యంత టఫ్ మ్యూజిక్ కాంపిటిటేషన్ ఇండియన్ ఐడల్‌లో సీజన్ 1,2,3లో పాల్గొని ఐదో స్థానంలో నిలిచారు. పాడుతా తీయగా ఆడిషన్‌కు కూడా వెళ్లి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.



ఐటీ రంగానికి పునాదులు వేసిన ధ్రువతార రాజీవ్‌గాంధీ


గోవిందరావుపేటలో కాంగ్రెస్ నాయకుల నివాళులు

ఏటూరునాగారం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఐటీ రంగానికి పునాదులు వేసిన ధ్రువతార మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భంగా మండల పార్టీ నాయకులు ఆయనకు ఘన నివాళుల ర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ చెన్నూరు బాలరాజు, ఎమ్డీ. గౌస్, రంజీత్, ఈసం నర్సయ్య, జిల్లా, మండల, గ్రామ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

● చిట్యాల : రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిర్వహించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిది దొడ్డి కిష్టయ్య రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, నాయకులు చిలుకల రాయ కొంరు, గుమ్మడి సత్య నారాయణ, సదయ్య, రాజమౌళి, మల్లేష్, తిరుపతి పాల్గొన్నారు.

●వాజేడు : మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణులు బుధవారం నిర్వహించారు. 34వ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ మాట్లాడారు.సీనియర్ నాయకులు దంతులూరి ప్రసాద బాబు రాజు, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ వత్సవాయి జగన్నాథరాజు, మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, నాయకులు రాంబాబు, గౌరయ్య, ఖాజావలి ఉన్నారు.

● గోవిందరావుపేట : దివంగత నేత, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమం బుధవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ బస్టాండ్ ఆవరణలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●మంగపేట : రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు టీవీ. హిదయతుల్లా ఇంటి ఆవరణంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ నాయకులు శ్రద్ధాంజలి ఘటించి రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డితో పాటు జిల్లా నియోజికవర్గం, బ్లాక్ మండల, గ్రామ అనుబంధ సంఘాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.


చిట్యాలలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహదారి నిర్మాణం చేపట్టాలని వినతి

వాజేడు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం-చెరుకూరు గ్రామాల మధ్య అటవీ శాఖ అభ్యంతరంతో నిలిచిపోయిన రహదారి నిర్మాణం చేపట్టాలని కాంగ్రెస్ మండల యువజన నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షుడు గౌరరాపు సర్వేశ్వరరావు వినతి పత్రం అందిం చారు. నల్లగాసి రమేష్, బంధం కృష్ణ, నూకల రవి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్ అప్పగింత

ములుగుటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ములుగు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని (సీఈఐఆర్) వినియోగిస్తూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేస్తున్నారు. పలువురు సెల్ ఫోన్లు పోగొట్టుకుని బుధవారం సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోగా ఫిర్యాదుదారుల మొబైల్ ఫోన్లను రికవరీ చేసి ములుగు ఎస్సై వెంకటేశ్వరావు బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సుమారు రూ. 80 వేల విలువ గల ఏడు సెల్ ఫోన్లను ఫిర్యాదారులకు అప్పగించామని తెలిపారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరికి గురైనా నిర్భయంగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు

ఎమ్మెస్పీ జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

భూపాలపల్లిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 24న జరగబోయే ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల భవిష్యత్ కార్యచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రావాలని కోరారు.

వీఆర్వో, వీఆర్ఏలు నియమాలు పాటించాలి

ములుగు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలన అధికారి(జీపీవో)గా పరీక్షలకు హాజరుకానున్న వీఆర్వో, వీఆర్ఏ అభ్యర్థులు తప్పకుండా నియమాలు పాటించాలని అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పలుశాఖల్లో పనిచేస్తున్న వీఆర్వో, వీఆర్ఏలకు జీపీవో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పరీక్షలకు హాజరయ్యే వీఆర్వో, వీఆర్ఏలు హాల్‌టికెట్ పైన పాస్‌పోర్టు సైజు ఫొటో అతికించి ఫొటోపైన ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయపు అధికారి సంతకంతో అటెస్టెడ్ చేయించాలన్నారు. అభ్యర్థి నామినల్‌రోల్ కోసం తమవెంట మరొక పాస్‌పోర్టు సైజ్ ఫొటో కాపీ తీసుకుని ఆఫొటోపై కూడా ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయపు అధికారి సంతకంతో అటెస్టెడ్ చేయించి పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 94937 16990ను సంప్రదించాలని ఆయన సూచించారు.

భూముల సరిహద్దు సమస్యను పరిష్కరించాలి

ములుగు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా భూముల సరిహద్దు సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐపార్టీ జిల్లా సమితి సభ్యుడు ముత్యాల రాజు, రైతు కంకల రమేష్‌లు బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపూర్ మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించడం జరిగిందని కానీ, భూముల సరిహద్దు సమస్యను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని అన్నారు. 30 ఏళ్లక్రితం 1859సర్వే నంబర్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ రైతులు పొందిన భూముల్లోకి పాత పట్టాదారు పేరుతో కబ్జాలోకి రావడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేటి నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

మంగపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) మంగపేటలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నుంచి ఇంటర్మీయట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కళాశాల సీఎస్. వై.రేణుకాదేవి, డీఎంవో గోవర్ధన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీయట్ ప్రథమ ద్వితీయ సంవత్సరంలో 25 మంది విద్యార్థులు ఫెయిల్ అయి ఉన్నారని, వారికి ఈ పరిక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి 27 తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉంటుందని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఎగ్జామ్ ఉంటుందని గురువారం తెలుగు హిందీ పరిక్షలు ఉంటాయని వారు వెల్లడించారు .

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కృష్ణకాలనీ, మే 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని కోల్‌మైన్స్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ బ్రాంచి ఇన్‌చార్జీ కోల నాగేంద్రబాబు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన సీఎంపీఎఫ్ రిజినల్ కమిషనర్‌ను కలిసి ఆయన వినతి పత్రాన్ని అందించారు. సింగరేణి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పర్మినెంట్ అకౌంట్‌లు వెంటనే ఇప్పించాలని, ఆన్‌లైన్ చేసి వాటి వివరాలను చూసుకునేలా చూడాలని, సీఎంపీఎఫ్ లోన్ సదుపాయం 90 శాతం వర్తింపజేయాలని కోరారు. ఆయన వెంట పలువురు సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ట్రైబల్ మీట్‌లో గురుకుల విద్యార్థులకు సత్కారం

కాటారం, మే 21(ఆంధ్రజ్యోతి): 2024-2025 విద్యాసంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సుప్రియ, లావణ్య, సాయికీర్తనలను రాష్ట్ర మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క బుధవారం సత్కరించారు. హైదరాబాద్‌లోని కుమ్రంభీమ్ ఆదివాసీభవన్ లో జరిగిన సక్సెస్ మీట్-2025లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంస పత్రాలను మంత్రి చేతులమీదుగా అధికారులు అందజేశారు. గురుకులం ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఉన్నారు.

ఉత్తమ ఎస్సైకి అభినంధనలు

ములుగు/ గోవిందరావుపేట, మే 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఉత్తమ ఎస్సైగా ఎంపికైన పస్రా ఎస్సై కమలాకర్‌కు ములుగు జిల్లా ఎస్పీ శబరీష్ బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్న ఎస్‌హెచ్‌వోల కోసం రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల వద్ద క్యూఆర్ కోడ్ పెట్టి ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని టాప్ టెన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలలో ములుగు జిల్లా పస్రా ఎస్సై కమలాకర్ ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆదరాభిమానాలను పొందినందుకు తెలంగాణ డీజీపీ జితెందర్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని తెలిపారు.


డీజీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకంటున్న పస్రా ఎస్సై

వడదెబ్బ తో 40మందికి పైగా అస్వస్థత

కాళేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి):సరస్వతీ పుష్కరాలకు వస్తున్న భక్తులకు మండుతున్న ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. బుధవారం సైతం పలువురు భక్తులు వడదెబ్బ, డీ హైడ్రేషన్, గిడ్డీనెస్, గుండె సంబంధిత అస్వస్థతలతో ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పుష్కరాల ఏడో రోజున ఇన్‌పేషంట్ల తాకిడి నెలకొంది. శిబిరంలో 68మంది ఇన్‌పేషంట్లకు చికిత్సనందించగా వారిలో 45మందికి పైగా వడదెబ్బ, డీ హైడ్రేషన్ సమస్యలతో అడ్మిట్ అయ్యారని వైద్యులు తెలిపారు. ఫ్లూయిడ్స్ అందించామని పేర్కొన్నారు.

జాయ్ రైడ్ ఎత్తేశారు..!

కాళేశ్వరం, మే 21(ఆంధ్రజ్యోతి):సరస్వతి పుష్కరాల్లో ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో భక్తుల కు విహంగవీక్షణం ఆనందం అందించడానికి జాయ్ రైడ్ పేరిట ఏర్పాటు చేసిన హెలీకాప్టర్ సేవలు రెండు రోజులకే విరమించారు. పుష్కరాల నాలుగో రోజు హెలీకాప్టర్ రాగా 30మంది భక్తులు 5 రైడ్లలో విహంగ వీక్షణం చేశారు. మంగళవారం 3 రైడ్లు మాత్రమే జరగడంతో నిర్వాహకులు తమ పెట్టుబడి కూడా వెళ్లే పరిస్థితి లేదనే ఆలోచన తో బుధవారం హెలీప్యాడ్ నుంచి హెలీకాప్టర్‌ను బెంగళూరుకు తరలించారు. దీంతో రెండు రోజుల మురిపెం తీరిందని భక్తులు అభిప్రాయపడ్డారు.

స్థల పరిశీలన చేసిన అధికారులు

కాళేశ్వరం, మే21(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో పుష్కరాల కోసం వచ్చే భక్తుల రద్దీ పెరుగుతుండడంతో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి ఆర్డీవో రవి స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఇప్పటికే ఉన్న పార్కింగ్‌లకు అదనంగా మరొకటి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో భక్తుల రద్ది ఎంత పెరిగిన పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామని వారు తెలిపారు.

పోలీసుల వాహన తనిఖీలు

వెంకటాపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యోగితా నగర్ గ్రామ సమీపంలో పోలీసులు బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రెయినీ ఎస్సై తిరుపతి మండలకేంద్రానికి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు, కొత్త వ్యక్తుల నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు.

తరలని వరి ధాన్యం


కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసి ఉన్న బస్తాలు

మల్హర్, మే 21(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం పోసిన రైతులు తూకం వేసిన తర్వాత కూడ వరి ధాన్యం తరలక ఇబ్బందులు పడుతున్నారు. కాంటాలు నిర్వహించి రోజులు గడుస్తున్నా లారీలు రాక పోవడంతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కళ్లంలోనే ఉండడంతో గాలివాన దుమారానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాడిచర్ల కొనుగోలు కేంద్రంలో కాంటాలు నిర్వహించిన వరి ధాన్యం తరలకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేది లేక కళ్లాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. తూకం వేసిన బస్తాలు తరలక పోవడంతో మిగతావి తూకం వేయని పరిస్థితి ఉంది.

బోధనా పద్ధతుల మార్పులతో నాణ్యమైన విద్యను అందించాలి


కాటారంలో మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

కాటారం, మే 21(ఆంధ్రజ్యోతి):మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన పద్ధతులను మార్పు చేసుకుని నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు 5రోజుల పాటు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణా తరగతులను బుధవారం డీఈవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యను పెంచేలా శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. కార్యక్ర మంలో ఎంఈవో శ్రీదేవి, ఏఎంవో లక్ష్మణ్, ఆర్పీలు తదితరులు ఉన్నారు.

● మల్హర్ : మండలంలోని వల్లెంకుంట ఉన్నత పాఠశాలలో సాగుతున్న మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని బుధవారం డీఈవో రాజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి వారిని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

కురిసిన భారీ వర్షం.. తడిసిన వరి ధాన్యం


వాజేడులో జలమయమైన రోడ్డు


రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న భక్తులు

తాడ్వాయి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మొస్తర నుంచి భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన వరి ధాన్యం, క్వాంటా పెట్టిన ధాన్యం బస్తాలు పూర్తిగా తడిచిపోయాయి. ధాన్యాన్ని కుప్పలు చేసుకునే సమ యం ఇవ్వకండా వర్షం దంచికొట్టడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించినప్పటికీ కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందంటున్నారు.

●ఏటూరునాగారం : ఏటూరునాగారం మండలంలో వర్షాలు వీడడం లేదు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు అన్నదాత ఇంకా కోలుకోక ముందే బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. కాగా, మండల కేంద్రలోని జీసీసీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడవడంతో రైతులు ధాన్యంపై పరదాలు కప్పి కాపాడుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేశారు. అంతేకాకుండా ఆకులవారిఘణపురం, ఎక్కెల, భూటారం, రొయ్యూరు, శంకరాజుపల్లి, రామన్నగూడెం గ్రామాలల్లో కూడా వర్షం కురవడంతో రైతులు అప్రమత్తమయ్యారు.

● తాడ్వాయి : మండలంలోని మేడారం, నార్లాపూర్, వెంగళాపూర్ పరిసర గ్రామాల్లో బుధవారం గాలివాన కురిసింది. ఈ క్రమంలో రహదారులపై భారీ వృక్షాలు కూలిపోయాయి. ఈ క్రమంలో భక్తులకు స్థానికులకు ప్రయాణంలో ఇబ్బందులు కలిగాయని వారు తెలిపారు. గంట పాటు శ్రమించి భారీ వృక్షాన్ని భక్తులు తొలగించారు. అంతే కాకుండా మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన పలువురు భక్తులు చెట్ల కింద విడిది చేశారు. ఈ క్రమంలో వర్షం రావడంతో వారివారి వాహనాల్లోకి పరుగులు తీశారు. అరగంట పాటు కురిసిన వర్షం తగ్గిపోవడంతో విడిది చేసిన వస్తువులను తీసుకొని తిరుగు ప్రయాణం చేశారు.

● వాజేడు : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకొని ఉరుములు, మెరుపులుతో కూడిన భారీ వర్షం పడింది. సుమారు గంట పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు చెరువులను తలపించాయి. వర్షంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా గంట పాటు నిలిచిపోయింది. కాగా ఎండ వేడిమితో ఉక్కపోతల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

గిరిజన మత్స్య సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఏటూరునాగారం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో గిరిజన మత్స్య సహకార సంఘాల బలోపేతానికి ఐటీడీఏ కృషి చేస్తుందని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో పెసా మొబిలైజర్లు, మత్స్య సహకార సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం జరగగా ఆమె పాల్గొని మాట్లాడారు. దర్తీ అపజాన్ జాతీయ గ్రామ అభియాన్ పథకం ద్వారా ములుగు జిల్లాలో 16 గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయని, అంతేకాకుండా అర్హులైన గిరిజనులతో నూతనంగా మరికొన్ని సహకార సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈపథకానికి 14రకాల సంఘాలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మత్స్య పరిశోధన విభాగం ప్రధాన శాస్త్రవేత్త శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.!

- మాజీ కో ఆప్షన్ మెంబర్‌కు గాయాలు

కృష్ణకాలనీ,మే 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో మునిసిపల్ మాజీ కోఆప్షన్‌మెంబర్‌కి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంప్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపల్ మాజీ కోఆప్షన్‌మెంబర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్ పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై మంజూర్‌నగర్‌కు వెళ్లి తిరిగి భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గం మధ్యలో హెచ్‌పి పెట్రోల్ పంప్ ఎదురుగా కాళేశ్వరం దైవ దర్శనానికి వెళ్తున్న కారు వెనకాల నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ఇర్ఫాన్ కిందపడిపోగా తలకు, కాలుకి గాయాలయ్యాయి. ఆ వెంటనే స్థానికులు గమనించి అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని అరా తీశారు. ప్రమాదానికి కారణమైన కారు, ద్విచక్ర వాహనాల్ని ఠాణాకు తరలించారు.

ఎన్టీఆర్ ఆశయాలే టీడీపీకి శ్రీరామ రక్ష

మంగపేట, మే 21 (ఆంధ్రజ్యోతి) స్వర్గీయ నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) ఆశయ సాధనే టీడీపీకి శ్రీరామ రక్షాని టీడీపీ రాష్ట్ర నాయకుడు, ములుగు జిల్లా అడ్‌హక్ కమిటి సభ్యుడు యానాల అనంతరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ సీనీయర్ నాయకులతో కలిసి అనంతరెడ్డి పర్యటించి టీడీపీ అభిమానులు మాజీ సీనీయర్ కార్యకర్తలను కలిసి వారి జీవనస్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం కమలాపురంలో టీడీపీ అభిమానుల కార్యకర్తల సమావేశం సీనీయర్ రాష్ట్ర కమిటి సభ్యుడు ఎల్వీజీ. నాయుడు అధ్యక్షతన జరుగగా అనంతరెడ్డి మాట్లాడారు. పేదలకు కిలో రూపాయి బియ్యం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని తెలిపారు. ఈనెల 27, 28, 29లలో జరుగు తెలుగు మహనాడు జరుగుతుందని టీడీపీ కార్యకర్తలు తరలిరావాలన్నారు.

మార్మోగిన రామనామస్మరణ


ఇరుముడితో వెళుతున్న ఆంజనేయస్వామి భక్తులు

ఏటూరునాగారం, మే 21 (ఆంధ్రజ్యోతి): 41, 21, రోజుల పాటు కఠోరమైన నియమ నిబంధనలతో దీక్షలు బునిన అంజన్న స్వాములు తమ దీక్షలను విరమించుకొని బుధవారం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో గురు స్వాములతో ఇరుముడి కట్టుకున్నారు. దీంతో అంజనేయ స్వామి శరణు ఘోషతో రామాలయం మార్మోగిపోయింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాలధారుల కుటుంబ సభ్యులు, భక్తులు, ఆంజనేయ స్వాముల నుంచి ఆశీర్వాదాలు పొందేందుకు పడిపడి దండాలు పెడుతూ బారులు తీరారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. కాగా, ఇరుముడి కట్టుకున్న స్వాములు జై హనుమాన్, జైజై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ కొండగట్టు, భద్రాచలం దివ్యక్షేత్రాలకు సుమారు 90 మంది స్వాములు బయలుదేరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అర్చకులు ఎల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ, ఆంజనేయ గురు స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● మంగపేట : మండలంలోని శ్రీరామాలయాలు ఆంజనేయస్వామి దేవాలయాలు శ్రీరామనామస్మరణతో మారుమోగాయి. కమలాపురంలోని శ్రీసీతారామాచంద్రస్వామి గ్రా శివారులో గల శ్రీ ప్రసన్నాంజనేయాస్వామి, రమంగపేటలోని శ్రీఉమాచంద్రశేఖరస్వామి దేవాలయాలతో పాటు బోరునర్సాపురం, కొత్తపేట తిమ్మంపేట మల్లూరు రాజుపేట తదితర గ్రామాల్లో గల ఆలయాలలో అంజన్న మాలధారణ వేసుకున్న స్వాములు 41 రోజులు మండలకాలం ఉపవాస దీక్షలు చేసి భద్రాచలం, కొండగట్టు దేవాలయాలకు ఇరుముడులు కట్టుకొని అంజన్న భక్తులు బయలుదేరారు. గురు, కన్నీ కత్తి గంట సీనియర్ స్వాములు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఆంజనేయస్వామి భక్తులు

వైభవంగా కోటంచ గర్భగుడి పనులు ప్రారంభం

రేగొండ, మే 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గర్భగుడి పునర్నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి వల్లూనాయక్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం రేగొండ గ్రామస్తులు ఆహ్వానం మేరకు మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ఆర్చ్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్థపతి వెంట కోటంచ ఆలయ చైర్మన్ భిక్షపతి, ఎస్ఈ దుర్గా ప్రసాద్, డీఈ రమేష్‌బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, అర్చకులు సురేష్ ఆచార్యులు, గ్రామస్తులు ఏనుగు జనార్దన్‌రెడ్డి, సామల తిరుపతిరెడ్డి, గుర్రాల సుమన్‌రెడ్డి, వాకిటి సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, రమేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న స్థపతి వల్లూనాయక్

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : జయశంకర్
Jayashankar Aco - 9985426984, Bhupalpally SR - 8008795764
Mulugu SR - 9849245045, Eturunagaram SR - 7673960447
ACM - 9985411664